క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ పంచాయతీలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ పి.ఏడుకొండలరావు బుధవారం తెలిపారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

3 నుంచి దసరా మహోత్సవాలు

భట్టిప్రోలు: వెల్లటూరు లాక్ సెంటర్‌లో కొలువైన నాగేంద్ర స్వామి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవానీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి నిత్యం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం భజనలు జరుగుతాయని వివరించారు.

ఐ క్లినిక్ ప్రారంభం



నిజాంపట్నం: అధునాతన పరికరాలతో నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఎస్ఐ కె.తిరుపతిరావు కోరారు. నిజాంపట్నంలో బుధవారం అక్షయ్ ఐ క్లినిక్ సెంటర్‌ను ఎస్ఐ తిరుపతిరావు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రారంభోత్సవం సందర్భంగా రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అక్షయ్ ఐ క్లినిక్, ఆప్టికల్స్ ప్రతినిధులు శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రుణాల అవకతవకలపై విచారణ జరపాలి



బాపట్ల: జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ఇచ్చిన రుణాల్లో బాపట్ల, ఒంగోలు పరిధిలో అవకతవకలు జరిగాయని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా పేర్కొన్నారు. ఈ మేరకు జేసీ ప్రఖర్ జైన్‌కు వినతిపత్రం అందించారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు



బాపట్ల: డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బస్టాండ్‌లో శుభ్రత–పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు బస్టాండులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కొత్తబస్టాండ్ ఆవరణంలో చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, అధ్యాపకేతర సిబ్బంది సుధాకర్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె పట్టణంలోని ప్రకాశం స్కూలు ఆవరణంలో నిలిచిన వర్షపునీరు



రేపల్లె పట్టణం అంబేద్కర్ పార్కు వద్ద జలమయం

జనజీవాన అవస్థలు

- భారీ వర్షంతో ఇక్కట్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- భట్టిప్రోలులో 9.6మిల్లీ మీటర్ల వర్షపాతం

అల్పపీడన ప్రభావంతో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఫలితంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లడంతో రహదారులపై మురుగునీరు చేరింది. మోకాళ్లలోతు నీళ్లలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలో వర్షపు నీరు నిలిచిపోయింది. భట్టిప్రోలులో 9.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

రేపల్లె జలమయం

రేపల్లె పట్టణం భారీ వర్షానికి జలమయమైంది.



రేపల్లె పట్టణం పద్మావతి థియేటర్ సెంటరులో జలమయమైన రహదారి

ప్రధాన రోడ్లలో వర్షపు నీరు నిలిచింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు రేపల్లెలో 70.2 మిల్లీమీటర్లు, చెరుకుపల్లిలో 110.2 మిల్లీమీటర్లు, నగరంలో 161.0 మిల్లీమీటర్లు, నిజాంపట్నంలో 84.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

– భట్టిప్రోలు/రేపల్లె రూరల్



రేపల్లె రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో ఇదీ దుస్థితి



రేపల్లెలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఇదీ పరిస్థితి



భట్టిప్రోలు జెండా చెట్టు బజారులో నిలిచిన వర్షపు నీరు

వరద బాధితులకు ఆపన్నహస్తాలు



కొల్లూరు మండలం తోకలవారిపాలెంలో నిత్యావసరాలు అందిస్తున్న సర్పంచి కృష్ణమోహన్



రేపల్లెలో అనగాని శివప్రసాద్‌కు చెక్కును అందిస్తున్న ఆక్స్‌ఫర్డ్ స్కూలు విద్యార్థులు

కొల్లూరు/రేపల్లె రూరల్ : వరద బాధిత కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు సహాయ, సహకారాలు అందిస్తున్నాయి. మండలంలోని తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్‌లో సహృదయ ఫౌండేషన్ నేతృత్వంలో గ్రామంలోని కుటుంబాలకు నిత్యావసర సరకులను సర్పంచి టి.కృష్ణమోహన్ పంపిణీ చేశారు. అమెరికాలో స్థిరపడి సొంత ప్రాంతంలోని పేదలను ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన సహృదయ ఫౌండేషన్ అనేక సమయాలలో ప్రజలను ఆదుకొందని ఈ సందర్భంగా సర్పంచి కొనియాడారు. అనంతరం 50 కుటుంబాలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి జి. శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు బి.సుబ్బారావు, వాగోలు ఏసు తదితరులు పాల్గొన్నారు.

- వరద బాధితులకు నగరం మండలం ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు బుధవారం చేయూతనిచ్చారు. విద్యార్థులు స్కూల్ యాజమాన్యంతో కలిసి రూ.50,555ను సేకరించి రేపల్లెలోని మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్‌కు అందజేశారు.
- వరద బాధితులను ఆదుకోవడానికి ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ సభ్యులు చేయూతనిచ్చారు. ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీవీ మోహన్ రావు(రేపల్లె), కార్యదర్శి ఏజీకే మూర్తి, పరీక్షల కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, సభ్యుడు కె.రామలింగేశ్వరరావు (గుంటూరు) ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1,50,116ల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం కలిసి అందజేశారు.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి

కర్లపాలెం/వేమూరు: ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెంలో బుధవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్ళి బ్రోచర్‌లు అందజేసి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, తహసీల్దార్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యులు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, నంగు సాంబశివారెడ్డి, జనసేన సమన్వయ కర్త శివన్నారాయణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- వేమూరు మండలం పోతుమర్రులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.



పోతుమర్రులో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్ చిత్రంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల సత్తా



ప్రతిభ చూపిన పెసర్లంక విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్



ప్రతిభ చూపిన బాలబాలికలతో సూరేపల్లి హెచ్‌ఎం శ్రీనివాస శర్మ, పీఈటీ నాగేశ్వరరావు

భట్టిప్రోలు: చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఆటలు పోటీలు, అథ్లెటిక్స్‌లలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీహైస్కూల్, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పెసర్లంక హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్ త్రోలో ఎన్.సంతోష్ ప్రథమ, 100, 200, 400 మీటర్ల విభాగాలలో కె.నిహారిక ప్రథమ స్థానంలో నిలిచారు. సూరేపల్లి హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాలలో వి.చైతన్య ప్రథమ, డిస్క్‌త్రోలో బి.గీతికాశ్రీ, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో జె.నితీష డిస్క్‌త్రోలో ఎం.అభిరామ్ ద్వితీయ, 400, 200, 800 మీటర్ల రన్నింగ్‌లో కె.ప్రవల్లిక ద్వితీయ స్థానాలు సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్, పీఈటీ నాగేశ్వరరావు, ప్రతిభ చూపిన బాలబాలికలను ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ బాషా, కె. శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిభ చూపిన బాలబాలికలు ఈనెల 27న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు శిక్షణనిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌బాబు



యాజలిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు రైతులు



వేమూరు మండలం బూతుమల్లిలో రైతులతో వ్యవసాయాధికారులు



గోవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



కొల్లూరు మండలంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

రేపల్లె రూరల్/కర్లపాలెం/వేమూరు/కొల్లూరు: సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాకులు (ఏడీఏ) రాగాల విజయ్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పేటేరు గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయం గురించి వివరించారు. ప్రకృతి సేద్యం ఆవశ్యకతను చెప్పారు. తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పుష్పకుమారి, వీఆర్వో సర్దార్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, నాయకులు కనపర్తి రవికిరణ్, దశరథరామయ్య, డీవీ ధనుమంజయరావు, ఆరేపల్లి నాగరాజు, వాకా శంకరరావు, శొంఠి నరేంద్రప్రసాద్, వీఏఏ సుష్మా, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

- కర్లపాలెం మండలంలోని యాజలి, దుండివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్‌కే హుస్సేన్ రైతులకు వరి సాగులో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, ఏఈవో కె.భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.
- వేమూరు మండలం బూతుమల్లి, గోవాడ యలవర్రుల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ లోకేశ్వరి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.
- కొల్లూరు మండలం ఈపూరు, చిలుమూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు పి.రాజేంద్రప్రసాద్, హార్టికల్చర్ అసిస్టెంట్ వినీత, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలపై అవగాహన అవసరం

రేపల్లె రూరల్: చిన్నారుల్లో దేశ సంస్కృతీసంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 1వ వార్డు శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీలో నెలకొల్పిన బాల వికాస్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. భారతీయ సంప్రదాయాలపై విద్యార్థులకు గురువులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం చిన్నారులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సభ్యులు నంబూరు వేణు, రమాదేవి.మాతాజీ గున్నం అనూష పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జంజనం హేమశంకరరావు

ఆన్‌లైన్‌లో నమోదు కాకున్నా పంట నష్టపరిహారం ఇవ్వాలి




కొల్లూరు : ఆన్‌లైన్‌లో నమోదు కాని పొలాల్లో దెబ్బతిన్న పంటలకూ పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈపూరుకు చెందిన రైతులు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో లేని భూములకు పంట నష్ట నమోదు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని, వెంటనే నష్టం నమోదు చేయాలని ఆర్ఐ త్రివేణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమృతలూరు కృపానందం, రైతులు పాల్గొన్నారు.

నేడు చిత్రకారుడు చిదంబరేశ్వరరావుకు

‘దర్శనాచార్య’ కొండూరు అవార్డు ప్రదానం

తెనాలి: ‘దర్శనాచార్య’ డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు 112వ జయంతిని గురువారం తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలోని కవిరాజు త్రిపురనేని భవనంలో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటయే సభకు రవీంద్రపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యుల స్మారకోపన్యాసం చేస్తారు. ఇదే సభలో విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావుకు డాక్టర్ కొండూరు అవార్డుతో సత్కరిస్తారు. ఈఎల్‌వీ అప్పారావు, పావులూరి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కావూరి రమాదేవి పాల్గొంటారు. డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులు ధర్మనిధి, ఆలపాటి కళావతి రవీంద్రపీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



పావులూరి చిదంబరేశ్వరరావు

చిత్రకళలో ప్రత్యేకం చిదంబరేశ్వరరావు...

అవార్డుగ్రహీత పావులూరి చిదంబరేశ్వరరావు 1964లో మంచిలీపట్నంలో జన్మించారు. మద్రాస్ ప్రభుత్వం వారి ఫ్రీహ్యాండ్ అవుట్‌లైన్ డ్రాయింగ్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మచిలీపట్నంలోనే బీఎస్సీ చేశారు. గుంటూరులో టీచర్ ట్రైనింగ్ కోర్సు చేశారు.1985 నుండి ఒక దినపత్రిక పబ్లికేషన్స్‌లో చిత్రకారుడిగా ఉద్యోగంలో చేరారు. కథలు, సీరియల్స్‌కు బొమ్మలు వేస్తూ 2000 వరకు కొనసాగారు. 2007 నుంచి టీవీ మీడియాలోకి ప్రవేశించారు. ప్రైవేట్‌గా మోరల్ స్టూడియో వారి వేమన పద్యాలకు యానిమేషన్ చిత్రాలను రచించారు.సినిమాలకు టైటిల్ రాయటం వీరి మరో ప్రత్యేకత. దేశంలోని వివిధ నగరాల్లో వీరి చిత్రాలు ప్రదర్శనలకు నోచుకున్నాయి. నడివయసులో ఫైనార్ట్స్‌లో డిగ్రీ చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

కష్టాల నివృత్తికి శిక్షణ

- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత తర్ఫీదు
- వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రం నిర్వహణ
- బ్యాచ్‌కు 50 మంది చొప్పున కుట్టు శిక్షణ
- దిగ్విజయంగా పూర్తయిన మొదటి బ్యాచ్ పూర్తి
- త్వరలో కంప్యూటర్ శిక్షణకు ఏర్పాట్లు



వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుట్టు శిక్షణ పొందిన మహిళలు(ఫైల్)

వేమూరు: మహిళల ఆర్థిక కష్టాల నివృత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కౌశల్య యోజన పథకం ద్వారా జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉచిత శిక్షణకు శ్రీకారం చుట్టింది. కుట్టు, అల్లికలు, కంప్యూటర్ శిక్షణ ఇచ్చేలా నియోజకవర్గస్థాయిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత జనవరిలో శిక్షణ కేంద్రం ఏర్పాటైంది. మొదటి బ్యాచ్‌లో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. ఇది దిగ్విజయంగా పూర్తయింది. రెండో బ్యాచ్‌లోనూ 50 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన మహిళలకు రుణాలు మంజూరు చేయించేందుకు కేంద్రం కృషి చేస్తోంది. జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు చూపుతుందని కేంద్రం ప్రతినిధులు చెబుతున్నారు.

> శిక్షణ పొందాలనుకునే మహిళలు
> సంప్రదించాల్సిన నంబర్ – 8008863095
> ఎస్‌కే రాజేశ్వరి శిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్

కుట్టు శిక్షణ పొందాను



కుట్టు శిక్షణ పొందాను. దీనివల్ల స్వయం ఉపాధి కలుగుతుంది. కేంద్రం రుణాలు ఇస్తోందని చెప్పారు. అవి మంజూరైతే జీవనోపాధికి ఢోకా ఉండదు.

– సిహెచ్ స్వప్న, వేమూరు.

రుణాలిస్తే మేలు



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు రుణాలు ఇవ్వాలి. రుణాలిస్తే టైలరింగ్ షాపులు పెట్టుకుని మేం జీవనోపాధి పొందడంతోపాటు మరి కొందరికి ఉపాధి కల్పిస్తాం.

– అళ్లమూడి సుశీల, వేమూరు

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం



జిల్లా నైపుణ్య సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించాం. జాబ్‌మేళాల్లో ఉద్యోగాలు చూపిస్తాం.

–ఎస్‌కే రాజేశ్వరి, శిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్, వేమూరు

పౌష్టికాహార లోపంతో అనారోగ్యం



కొల్లూరు : పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనత బాధిస్తుందని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజ కుమారి అన్నారు. బుధవారం చినపులివర్రులో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఇంటిలో అందుబాటులో ఉండే వస్తువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పౌష్టిక పదార్థాలు లభ్యమయ్యే ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చునని వివరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.